థ్రిల్

ఉదయం నాలుగింటికి ఆగింది రైలు ఆ చిన్న స్టేషన్‌లో. భోగరాజు వెంట దిగాను నేను. సెకండ్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ లోంచి. ఇంకా తెల్లవారక పోవటంవల్ల చీకటి దట్టంగా అలుముకుని వుంది. స్టేషన్‌లోని లైట్లు అన్నీ వెలగడంలేదు.

సూట్‌కేస్‌లు, బెడ్‌హోల్డాలు దింపిన కొన్ని క్షణాలకే మళ్ళా బయలుదేరింది రైలు. అది మీటర్‌గేజ్ అవడం వలన రైలింజన్ డీసెల్‌ది కాదు, ఆవిరి ఇంజన్.

రైలు వెళ్ళిపోయేదాకా చూస్తూ నిలబడ్డాను. భోగరాజు దగ్గరకు వచ్చాడు ఓ పదిహేనేళ్ళ కుర్రాడు.

భక్తిగా నమస్కారం చేసి సామాను నెత్తిమీద ఎత్తుకొని బయటకి నడిచాడు. వాడిని అనుసరించాము మేము. స్టేషన్ మాష్టరు భోగరాజుని విష్ చేశాడు ఇంగ్లీషులో.

బహుశా ఇంగ్లీషు మాట్లాడేది ఆయనొక్కడే అనుకున్నాను. బయట మట్టి రోడ్డుమీద ఆగివున్న జీప్‌లో సర్దాడు మా సామాను. ఆ పదిహేనేళ్ళ కుర్రాడు స్టీరింగ్ వీల్ ముందు కూర్చుని జీప్‌ని స్టార్ట్‌చేయటం నాకాశ్చర్యం కలిగించింది. అంత చిన్న వయసులో జీప్ నడపడం నేర్చుకోవడం మెచ్చుకోదగింది.

జీప్‌లో ముందు సీట్లలో కూర్చున్నాం నేనూ, భోగరాజు.

"కళ్ళు తెరచి చూస్తూండు, పులులు, నక్కలులాంటి జంతువులు అనేకం కనబడతాయి మనం గెస్ట్‌హౌస్ చేరేలోగా. నిద్రపోకు" చెప్పాడు భోగరాజు.

జీప్‌ని సన్నటి మట్టిరోడ్డుమీద లాఘవంగా నడుపుతున్నాడు ఆ కుర్రాడు. హెడ్‌లైట్ల వెలుగులో ఆ రోడ్డుమీద రాలిపడ్డ ఎండుటాకులు, పువ్వులు కనబడుతూ. ఆ రోడ్డు ఎక్కువ ఉపయోగంలో లేదని స్పష్టమౌతోంది.

జీప్‌కి రెండుపక్కలా అయిదారడుగుల ఎత్తు పాము పుట్టలు. చూస్తూంటే ఒళ్ళు జలదరించేటట్లుగా ఉన్నాయి. గంధం చెట్లు ఎక్కువగా వున్నాయి.

"ఇంత చిన్న వయసులో ఇతనికి డ్రయివింగ్ ఎలా అబ్బింది అడిగాను.

"అభ్యాసం" చెప్పాడు భోగరాజు.

"లైసెన్స్ లేదా ?"

"అనవసరం. ఇక్కడ ఎవరు తనిఖీ చేస్తారు ?"

"అడవిజాతి వాడిలా వున్నాడే ?" అడిగాను అతని భుజాలదాక వేళ్ళాడే జుట్టు కండలు తిరిగిన నల్లటి శరీరం చూసి.

"అవును."

సిగరెట్ వెలిగించాను. భోగరాజు జేబులోంచి పొగాకు తీసి చుట్ట చుట్టసాగాడు.

"మన గెస్ట్‌హౌస్ కేర్‌టేకర్ దగ్గర పనిచేస్తాడు వీడు. అడవిలో తిరిగి వంటకి కావలసిన వంటచెరకు, దినుసులు తీసుకురావడం, కూరలు పండించడం ఆవులకి మేత వేయడం, పాలు పిండటం, కోళ్ళని కోయటం లాంటి అనేక పనులు చేస్తాడు వీడు. మూడుపూట్లా కడుపునిండా తిండి పెడితే చాలు. జీతం భత్యం ఇవ్వనక్కరలేదు. కేర్‌టేకర్ తెచ్చుకున్నాడు వీడిని. జీప్ డ్రయివింగ్ నేనే నేర్పించాను."

"చాకులాంటి కుర్రాడన్నమాట."

"భాష ఒక్కటే బాధ. మన తెలుగు రాదు. వీడి తెలుగు మనకి అర్థంకాదు. 'వీడికి మా భాష అసలర్థంకాదు."

"సౌంజ్ఞల ద్వారా నేనేనా ?"

"కేర్ టేకర్ మేనేజ్ చేయగలుగుతున్నాడు మనకి తెలియదు."

కాసేపటికి జీప్‌లోంచి దూరంగా వున్న కొండపక్కనేవున్న గెస్ట్ హౌస్‌ని చూపించాడు భోగరాజు. లోపల దీపాలు వెలుగుతున్నాయి.

జీప్ పెద్ద చెక్కగేటు ముందాగింది. దిగకుండా వేగం కొద్దిగా పెంచి, ముందుకి కదులుతున్న జీపుతోనే ఆ గేటు తలుపులు లోపలికి నెట్టేలాచేసి, విశాలమైన కాంపౌండ్‌లో ఆపాడు జీప్‌ని వాడు.

భోగరాజు వెంట దిగాను. కేవలం సున్నం కొండరాళ్ళతో కట్టిన గెస్ట్‌హౌస్‌కి బయట ఏ రంగూలేదు. అయిదారు గదులుండవచ్చనిపిస్తోంది బయటనుంచి చూస్తే. ఎడంప్రక్క పెద్దబావి. ఖాళీ స్థలంలో వివిధ రకాల కూరమొక్కలు, పూలమొక్కలు ఆ చీకటిలో చూచాయగా కనిపించాయి.

లోపలికి నడిచాము. లోపల సున్నం కొట్టివుంది గోడలకి. నా గది చూపించాడు భోగరాజు. కిటికీ రెక్క తెరవడానికి వీలు లేకుండా సన్నటి మెష్ అమర్చివుంది లోపల.

"దేనికిది?" అడిగాను.

"పాములు లోపలికి రాకుండా ?"

ఆ కుర్రాడు సామాను తీసుకొచ్చాడు లోపలికి. కేర్‌టేకర్ సూచనల ననుసరించి ఎవరి సామాను వాళ్ళ గదుల్లో వుంచి బయటకు వెళ్ళాడు. మళ్ళా జీప్ స్టార్టయిన శబ్దం. ఇంటి వెనకాల జీప్ వుంచే షెడ్ వుందనుకున్నాను శబ్దాన్నిబట్టి.

భోగరాజు హాల్లోకి వెళ్ళి ఓ పెద్ద బౌండ్ వేసిన లాగ్ బుక్స్‌లో మా

పేర్లు, ఎక్కడనుంచి వచ్చిందీ, సమయం, తేదీ మొదలయిన వివరాలన్నీ వ్రాసి సంతకం పెట్టాడు సిగ్నేచర్ కాలంలో.

కేర్ టేకర్ చెప్పాడు నవ్వి.

"మీ టెలిగ్రాం నిన్ననే అందింది. జీప్ పంపాను. రైలు లేట్ అవలేదన్న మాట."

"కులాసానా!" పలకరించాడు భోగరాజు ఆప్యాయంగా అతని భుజంమీద చేత్తోతట్టి.

తలవూపాడు అతను నవ్వుతూ. ఏభైపైనే వుంటాయి.

"మీ కుటుంబంతో వుంటున్నారా?" అడిగాను.

తల అడ్డంగా వూపాడు.

నా గదిలోకి నడిచాను పడుకుందామని. పెద్ద చెక్క మంచం. నులకతాడు అల్లి వుంది. దోమ తెర.

మర్నాడు ఉదయం ఏడున్నరకి కాఫీ కప్పుతో వచ్చాడు కేర్ టేకర్.

పదిన్నరకి బ్రేక్‌ఫాస్ట్. ఆమ్లెట్, రెండు జామ్ వ్రాసిన బ్రెడ్, స్లైసెస్, టీ.

మధ్యాహ్నందాకా పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాను. పన్నెండున్నరకి భోజనానికి పిల్చాడు గెస్ట్‌హౌస్ కేర్ టేకర్.

భోజనంచేస్తూ అడిగాను.

"మీరొక్కరేనా ఇక్కడ వుండేది?"

"అవును."

"విజిటర్స్ ఎవరూ లేకపోతే ఒంటరిగా వుండాల్సి వస్తుందికదా. భయం వేయదూ?"

"ఆరేళ్ళనుంచి అలవాటు."

"ఈ నల్లమలై ఫారెస్టులో ఆరేళ్ళ నుంచి వుంటున్నారా?"

"అవును. ఆంధ్రప్రదేశ్ ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌లో పధ్నాలుగేళ్ళ

నుంచి పని చేస్తున్నాను. మీలాగా సరదాగా వేటాడటానికి ఇదివరలో ఎప్పుడూ ఎవరో ఒకరు వచ్చి వుంటూండేవారు, కాని వన్యమృగ సంరక్షణ పథకం కింద వేటని నిషేధించాక ఫారెస్టు అఫిషియల్సే వస్తూంటారు అప్పుడప్పుడు ఒకోసారి విదేశీ యాత్రికులు వస్తూంటారు."

రాత్రి మళ్ళీ జీప్‌లో బయలుదేరాం ఆ కుర్రాడితో. భోగరాజు దగ్గర పర్మిట్ వుంది వేటాడటానికి. సరదాకోసం నేను భోగరాజు వెంట వచ్చాను అతని ఆహ్వానాన్ని అంగీకరించి. నాకు వేటరాదు. తుపాకీ పట్టడం అసలే చేతకాదు.

భోగరాజు నేర్పించాడు నాకు రైఫిల్ ఎలా ప్రేల్చాలో. కుడివైపు ఛాతీకి గట్టిగా అదిమిపెట్టి, సేఫ్టీకేచ్ తెరచి, ట్రిగ్గర్ నొక్కాలి గురిపెట్టాక. ఫైరింగ్ పిన్ బుల్లెట్స్‌ఎలా పేలుస్తుందో, గుండు ఎలా దూసుకుపోతుందో, రైఫిల్ పాయింట్‌ని బట్టి దాని శక్తి ఎలా అంచనా వేయాలో, యుద్ధంలో సైనికులు ఉపయోగించే రైఫిల్స్ ఎలాంటివో మొదలయినవన్నీ వివరించాడు.

జీవితంలో మొదటిసారిగా రైఫిల్‌ని పేల్చాను. నల్లమలై ఫారెస్టులో ఆ అర్ధరాత్రి. గట్టిగా నొక్కి పట్టుకోకపోవడంతో, రైఫిల్‌బట్ బలంగా తాకింది నా ఛాతీకి. ప్రేలుడికి అడవి అంతా ప్రతిధ్వనించింది. కొన్ని క్షణాలు.

క్రమంగా వేటలోని థ్రిల్ నాకు తెలియసాగింది. ఎలాగయినా ఓ పులినో, చిరుతనో వేటాడాలనే ఉత్సాహంతో వున్నాడు భోగరాజు ఆ రాత్రి. కారణం కేవలం ఒక రోజు వేటాడటానికి పర్మిషన్ దొరికింది భోగరాజుకి. మర్నాడు మధ్యాహ్నం తిరుగు బండిలో మళ్ళీ నంద్యాల వెళ్ళిపోవాలి మేము. ఒకవేళ అక్కడేవున్నా వేటాడకూడదు.

నిజానికి ఓ పదిరోజులు వుందామనే ఉత్సాహంతో వచ్చాము ఆ మారుమూల ప్రదేశానికి, తగినంత సామాను, సరంజామాతో.

భోగరాజు తెల్లారేదాకా జీప్‌లో ఓ వందమైళ్ళయినా తిప్పాడు. రెండు నెమళ్లు కనబడ్డాయి. ఒకదాన్ని కాల్చాడు నెమలి మాంసంకోసం. రెండు కుందేళ్ళని కాల్చాడు గెస్ట్‌హౌస్‌లో ఫ్రిజిడేర్ లేకపోయినా. తిన్నంత తిని పారేయాలి మిగతా మాంసాన్ని వృథాగా.

క్రూర జంతువులేం కనబడలేదు.

నిద్రమత్తుతో విసుగ్గా వెనక్కి తిప్పమన్నాడు జీప్‌ని. దారి పొడు గునా ఆ కుర్రాడిని తిడుతూనే వున్నాడు.

"వీడికి తెలుసు పులులెక్కడుంటాయో వాటి జాడ చెప్పకుండా మనల్ని అడవంతా తిప్పి తీసుకెళ్తున్నాడు."

"డబ్బిస్తే చెప్పేవాడేమో ?"

"వీడికి డబ్బక్కరలేదు. ఓ రమ్‌బాటిల్ ఇస్తే చెప్పేవాడు. తేవటం మరిచాను."

ఆశ్చర్యపోయాను ఆ కుర్రాడు తాగుతాడంటే ?

మర్నాడు మధ్యాహ్నం భోజనం అయ్యాక భోగరాజు పడుకు న్నాడు. ఉదయం నాకు నిద్ర అలవాటు లేదుకాబట్టి పుస్తకం చదవసాగాను.

సాయంత్రం అయేసరికి విసుగువేసి బయటకెళ్దా మనిపించింది. పైజామా విడిచి పేంట్, బూట్లు తొడుక్కుని భోగరాజు గదిలోకి నడి చాను. గాఢంగా నిద్రపోతున్నాడు.

లేపబుద్ధి కాలేదు.

బయటకి నడిచాను. నూతి దగ్గర నీళ్ళు తోడుతున్న ఆ కుర్రాడు నన్ను చూసి నవ్వాడు. ఏదో సౌంజ్ఞచేసి వాడి భాషలో చెప్పాడు, గాని నాకర్థం గాలేదు.

వాడు ఆగమని సౌంజ్ఞచేసి లోపలకి వెళ్ళి భోగరాజు గదిలో గోడకు వ్రేలాడే రైఫిల్ తీసుకువచ్చి, అందించాడు నాకు. నేను వేటకు వెళ్ళడం

లేదని తెలియదు. తెలిస్తే బహుశ రక్షణకోసంకూడ తీసుకెళ్ళమని ఇచ్చి వుంటాడు.

దాన్ని భుజాన తగిలించుకొన్నాక సంతోషంగా నవ్వి, మళ్ళీ తన పనిలో నిమగ్నమయ్యేడువాడు.

గేటుదాటి నడిచాను అడివిలోకి. అట్టే దూరం వెళ్ళదలచుకోలేదు. దారితప్పే ప్రమాదం వుంది. అందుకే నేవెళ్ళేదారి జాగ్రత్తగా చూసుకుని గుర్తుపెట్టుకుంటూ నడవసాగాను.

దాదాపు ఓ పావుగంట అలా నడిచాను.

పుట్టలు, చెట్లు, పొదలు, గుట్టలు, ముళ్ళు, అడవిలో ఒంటరిగా నడవటం భయం వేస్తుంది కరీంనగర్ లాంటి వూళ్ళో పుట్టి పెరిగిన వాళ్ళకి.

ఎదురుగా ఏదో చప్పుడయింది.

ఆగి చూసాను.

ఏం కనిపించలేదు.

నడవసాగాను.

మళ్ళీ ఏదో చప్పుడు.

ఈసారి ఆగిచూశాను. భుజంమీద నుంచి రైఫిల్‌తీసి సిద్ధంగా పట్టుకుని.

హఠాత్తుగా ఎదురుగా యాభై గజాల దూరంలో ఓ అడవి మనిషి ప్రత్యక్షమయ్యాడు. నల్లగా పోతపోసిన విగ్రహం కోయవాళ్ళలా పెరిగిన గిరజాలజుట్టు, నుదుటిమీద పులిచర్మంతో చేసిన బెల్టులా ఉపయోగపడే పీలికని జుట్టుకు కట్టుకున్నాడు మొహంమీద పడకుండా, ఎడం భుజానికి అంబులపొది, కుడిచేత్తో సంధించిన ఆరడుగుల విల్లు. వింటికి నాలుగడుగుల బాణం.

బాణం నావైపు, నా ఛాతీకి గురిపెట్టబడివుంది, ఎక్కుపెట్టి.

గుండె ఝల్లుమంది. ఏ మాత్రం ఆలోచన లేకుండా, అసంకల్పిత ప్రతీకారచర్యలా, రైఫిల్‌కున్న సేఫ్టీకేచ్‌ని వెనక్కిలాగాను. క్లిక్‌మంది బోల్టుదాన్ని వెనక్కి లాగగానే.

వాడి మొహంలోకి చూసాను. ఏమాత్రం దయ, దాక్షిణ్యం లేదా మొహంలో నల్లరాతితో చెక్కిన మొహంలా వుంది, ఏ భావం తెలియకుండా. గుబురు మీసాలు భయంకరంగా వున్నాయి. సంధించి ఎక్కుపెట్టిన విల్లుని ఇంకాస్త పైకెత్తాడు గురి తప్పకూడదని.

నేను మరింత గట్టిగా పట్టుకున్నాను రైఫిల్‌ని ఛాతీకి ఆనించి.

వాడెవడు ?

నేనెవరు ?

నా మీదకి బాణం ఎందుకెత్తాలి ? నేనేం అపరాధం చేసాను ? అవలీ అడవిజాతి వాళ్ళకి చంపడం ఓ ఆటా ? రైఫిల్ పేలిస్తే గుండు బాణం కన్నా వేగంగా దూసుకుపోయి వాడికి తగులుతుంది. బాణం వదిలితే అంత వేగంగా వస్తుందా ? పేల్చి పక్కకి తప్పుకుంటే ?

బుర్రనిండా వివిధ ఆలోచనలు. లోపల చెలరేగే భయాన్ని బయట పడనివ్వలేదు. నే భయపడుతున్నానని గ్రహిస్తే వాడు నిజంగా బాణం వదలచ్చు.

నిశ్చలంగా నించున్నాం ఇద్దరం ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుంటూ. సూర్యుడు అస్తమిస్తున్న గుర్తుగా చీకటి వ్యాపిస్తోంది.

ఏం చేయాలి.

కదలాలా, వద్దా ?

వాడి కళ్ళలోకి, మొహంలోకి కోపం, పగ, ఉద్రేకం తన్నుకు వస్తున్నాయి ఎంత అణచుకుందామనుకున్నా. తన ప్రాణం సైతం లెక్క చేయకుండా బాణం వదిలేలా వుంది వాడి తీరు.

బింకంగా రైఫిల్ ట్రిగర్‌మీద కుడివేలుని అలఓకగా ్రాసాను.

రెండు.

అయిదు.

పది.

పావుగంట దాటింది. అలానే నిల్చున్నాము ఇద్దరం చెరో మారణా యుధంతో. వాడు నిందోగలడు. అలా ఎంతసేపయినా కాని నా కలవాటు లేదు. అప్పటికే కాళ్ళు పీకుతున్నాయి.

దూరంనుంచి గట్టిగా పిలుపు వినబడింది. నా పేరు పిలుస్తున్నాడు కేర్ టేకర్.

ఇద్దరం విన్నాము ఆ పిలుపు

వాడు చిన్నగా నవ్విన గుర్తుగా ఎత్తయిన మీసాల వెనుక తెల్లటి పళ్ళు కనబడ్డాయి చీకటిలో.

తల పంకించాడు ఓసారి.

నెమ్మదిగా, అతి నెమ్మదిగా ఎక్కుపెట్టిన విల్లుని మామూలు స్థితికి తీసుకు రాసాగాడు. ఒక్కొక్క అడుగే వెనక్కి వేస్తూ.

వాడి ఆలోచన నా కర్థమై నేనూ రైఫిల్‌ని కొద్దిగా పక్కకి జరిపి ఒక్కొక్క అడుగే వెనక్కి వేయసాగాను. ఇద్దరం అయిదారడుగుల దూరం వెళ్ళాక వాడు కింద పడ్డాడు హఠాత్తుగా. ఏదో కాలికి అడ్డు తగిలి చేతిలోని విల్లు దూరంగా పడింది.

నేను వెనక్కి తిరిగి పరుగు లంకించుకున్నాను. వాడు నా వెంట పడలేదు అదృష్టవశాత్తు.

రొప్పుతూ పిలుపు వినిపించేవైపు పరిగెత్తాను. గెస్టుహౌస్‌లోని లైట్లు నా కళ్ళబడ్డాక పరిగెత్తడం ఆపి నడవసాగాను.

"ఏం జరిగింది?" అడిగాడు కేర్ టేకర్ నేను ఆయాసపడటం గమనించి.

రొప్పుతూ జరిగింది చెప్పాను.

"వాడు ఇక్కడికి వచ్చాడా మళ్ళీ ?" అన్నాడు ఆశ్చర్యంగాను.

"ఎవడు వాడు ?" అడిగాను.

"ఆ కుర్రాడి తండ్రి."

కోళ్ళని వాటి గూట్లలోకి పంపిస్తున్న ఆ పదిహేనేళ్ళ కుర్రాడిని చూపించి చెప్పాడు.

"వాడి తండ్రి, తండ్రిని వదిలేసి నా దగ్గరకి వచ్చాడు. పనికుర్రాడిగా చేరాడు నా దగ్గర. ఆ కోపంతో వాడు నన్ను చంపడానికి నాలుగైదు సార్లు ప్రయత్నించాడు. గెస్ట్‌హౌస్ కెవరైనా వస్తే వాళ్ళను చంపడానికి ప్రయత్నించాడు కొత్తల్లో. కాని క్రమంగా ఆ ప్రయత్నం విరమించుకున్నాడు."

"చంపుతాడా నిజంగా ?" అడిగాను.

"ఎంతో తేలిక వాడికి ప్రాణాలు తీయడం. ఇక్కడి విజిటర్స్ ఇద్దరికి వాడి బాణాలు తగిలాయి. అదృష్టవశాత్తు చావలేదు. ఆ గాయాల గుర్తులతో వెళ్ళారు ఇళ్ళకి."

ఓ గుటక వేశాను భయంగా.

"మీ దగ్గర రైఫిల్ వుండటంవల్ల బ్రతికిపోయారు."

నీరసంగా లోపలకి వెళ్ళాను. భోగరాజు గదిలో గోడకి తగిలించాను నా ప్రాణాల్ని రక్షించిన ఆ రైఫిల్‌ని.

"ఏమైంది ? అడిగాడు కుర్చీలో కూర్చుని టీ తాగుతున్న భోగరాజు అప్పుడే లేచినట్లుగా వుంది మొహం.

జరిగింది చెప్పాను.

వెంటనే స్ప్రింగ్‌లా లేచాడు భోగరాజు. టీ కప్పు నేలమీద పెట్టి గోడ దగ్గరికి వెళ్ళి రైఫిల్‌ని అందుకున్నాడు.

"పారిపోయి వుంటా డీ పాటికి" అన్నాను.

"అదృష్టవంతుడివి. ఇది కాపాడింది నిన్ను" అన్నాడు రైఫిల్ని ముద్దు పెట్టుకుని.

"అవును."

"నిజంగా అదృష్టవంతుడివి, నువే వెనక్కి పడివుంటే నడుస్తూ వాడు బాణం వదిలివుంటే?"

"కాల్చేసేవాణ్ని నిశ్చయంగా."

"అందుకే. ఆ భయంతోనే వాడు నిన్ను చంపలేదు. నిజంగా అదృష్టవంతుడివి."

"వాడుకూడా."

"కాదు. కేవలం నువ్వే రైఫిల్ని ఉదయం క్లీన్‌చేసి గోడకి తగిలించాను. కేట్ రిడ్జెస్ నింపలేదు. సూట్‌కేసులోంచి తీసి నింపడానికి బద్ధకంవేసి."

రైఫిల్ బేరల్ని నా ముక్కుకి ఆనించి ఆనందంగా నవ్వుతూ ట్రిగ్గర్ గబ గబా నొక్కసాగాడు.

రైఫిల్ పేలలేదు!

క్లిక్! క్లిక్!! క్లిక్!!!

(జ్యోతి మంత్లీ, మార్చి 1978)